క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది మంగళవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కొంతవరం గ్రామానికి చెందిన గిరి, నాగరాజులు పాణ్యం గ్రామంలో శ్రీ సుంకులాపరమేశ్వరి ఆలయం వద్ద మద్యం మానుకునేందుకు పూజ చేసి బైక్‌పై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కింద పడింది. దీంతో గాయపడిన ఇద్దరిని స్థానికులు నంద్యాల ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

మహానంది అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు

గడివేముల: మహానంది దేవస్థానం అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆలయ ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన గడివేములలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ శ్రీశైలం ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి సహకారంతో రూ.2 కోట్లతో చేట్టిన సుందరీకరణ పనులు పూర్తి కావడానికి వచ్చాయన్నారు. అలాగే టీటీడీ నిధులు రూ.4.60 కోట్లతో వసతి గృహాలను నిర్మించనున్నట్లు చెప్పారు. వేసవికాలంలో భక్తులు ఇబ్బంది పడకుండా ఓ దాత సహకారంతో ఆలయప్రాంగణాల్లో ప్రత్యేక మ్యాట్లు త్వరలో వేస్తామన్నారు. అలాగే ఆయన మూలపెద్దమ్మ దేవస్థానం అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో నేడు (బుధవారం) పొదుపు మహిళలకు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా మూడవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు తెలిపారు. మండలంలో 813 పొదుపు సంఘాలలోని 8,353 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా కింద ప్రభుత్వం రూ.471.07 లక్షలు మంజూరు చేసిందన్నారు. కాగా మంగళవారం ఎంపీడీఓ స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో వైకేపీ సీసీలు, వీఓఏలు, గ్రామ సచివాలయాల సంక్షేమ సహాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆసరా కార్యక్రమానికి పొదుపు మహిళలు గ్రామాల నుంచి మండల కేంద్రం సి.బెళగల్‌కు వచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకోసం వలంటీర్లు, పొదుపు సంఘాల లీడర్లు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నీవే జగనన్న' ప్రజల్లోకి తీసుకెళ్దాం

సి.బెళగల్: 'మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమంను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జేసీఎస్ సీబీ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని గ్రామాలలో పర్యటించి ఆయా సచివాలయాల్లో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా సి.బెళగల్ – 2 గ్రామ సచివాలయంలో సర్పంచ్ పాండురంగన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యక్రమ పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. అనంతరం వలంటీర్లకు, గృహ సారథులకు మెటీరియల్ పంపిణీ చేశారు.

ప్రశాంతంగా టెంకాయల వేలం

గూడూరు: ఈ నెల 14 నుంచి జరగనున్న తిమ్మగురుడు స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించి మంగళవారం నిర్వహించిన టెంకాయల వేలంపాట ప్రశాంతంగా జరిగింది. ఆలయ ఈఓ గురు రెడ్డి ఆధ్వర్యంలో ఆలయం ఆవరణలో నిర్వహించిన వేలంలో ఉత్తకాల్ల రామాంజనేయులు అనే వ్యక్తి రూ.91 వేలకు వేలం పాట దక్కించుకున్నాడు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, కో ఆప్షన్‌మెంబర్ పి.రామాంజనేయులు పాల్గొన్నారు.

కొత్తూరులో అటవీశాఖాధికారి పూజలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం జిల్లా ఫారెస్టు అధికారి శంకరరెడ్డి కుటుంబ సమేతంగా పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, కాలసర్ప దోషపూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకుడు నారాయణస్వామిలు తీర్థప్రసాదాలను అందించారు.

నాడు-నేడు పనులను శరవేగంగా పూర్తి చేయాలి

కోడుమూరు రూరల్: మండలంలో నాడు-నేడు 2వ విడత కింద ఎంపికైన పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఎంఈఓ అనంతయ్య సూచించారు. మంగళవారం మండలంలోని పులకుర్తి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మరింత రుచిగా వండాలని వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. అనంతరం పాఠశాలలో నాడు-నేడు కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులను నిర్ణీత సమయంలోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం సత్యవతికి సూచించారు.

'ఉద్యోగ' కాంతులు

- క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉస్మానియా డిగ్రీ కళాశాల విద్యార్థుల జయకేతనం
- వివిధ కంపెనీల్లో 75 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల కరస్పాండెంట్ అజ్రా జావీద్, ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్

కర్నూలు కల్చరల్: సాధారణ డిగ్రీ విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరుస్తూ ఉన్నతంగా రాణిస్తున్నారు. కళాశాల అధ్యాపకుల మార్గదర్శనం.. ప్రభుత్వ నూతన విద్యా విధానంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్ విద్యార్థుల్లో నవ్యకాంతులను నింపుతున్నాయి. ఇంటర్నషిప్‌తో పాటు ప్లేస్‌మెంట్స్‌లో స్కిల్స్‌ను ప్రదర్శించి ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. ఉస్మానియా డిగ్రీ కళాశాల మూడో సంవత్సరం విద్యార్థులు 75 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులను మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అజ్రా జావీద్, ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్ ప్రత్యేకంగా అభినందించారు.

ప్లేస్‌మెంట్స్ ఇలా..

- ఐసీఐసీ బ్యాంక్‌లో కస్టమర్ రిలేషన్షిప్ మేనేజర్ హోదాలో పనిచేసేందుకు 22 మంది ఎంపికయ్యారు. వీరికి తెలంగాణ రాష్ట్రంలో రూ.25,000, ఆంధ్రప్రదేశ్‌లో రూ.23,000 ప్రారంభ జీతం లభిస్తుంది.
- ఆల్‌సెక్ టాక్నాలజీస్ సంస్థలో బెంగళూరు, చెన్నైలో ఉద్యోగాలకు 15 మంది ఎంపికయ్యారు. వీరికి బెంగళూరులో రూ.16,000, చెన్నైలో రూ.15,000 ప్రారంభ వేతనంతో పాటు ఇతర అలవెన్సెస్ ఇవ్వనున్నారు.
- జియో డిజిటల్ సంస్థలో కస్టమర్ అసోసియేట్ ట్రైనీగా విధులు నిర్వహించేందుకు 38 మంది ఎంపికయ్యారు. వీరికి నాలుగు నెలల ఇంటర్న్‌షిప్ పీరియడ్‌లో స్కిల్‌ను బట్టి వేతనం, ఉద్యోగ హోదా, సదుపాయాలు ఇవ్వనున్నారు.

ఇంటర్న్‌షిప్ ప్లేస్‌మెంట్ కల్పిస్తున్నాం:

కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు వివిధ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ కల్పిస్తున్నాం .దాంతో పాటు వివిధ ప్రముఖ కంపెనీలను ఆహ్వానించి ప్లేస్‌మెంట్ కల్పిస్తున్నాం.విద్యార్థుల్లోని స్కిల్స్, సామర్థ్యం, కమ్యూనికేషన్‌స్కిల్స్ ను బట్టి ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారు. ఈ ఏడాది 75 మంది విద్యార్థులు డిగ్రీ చివరి సంవత్సరంలోనే ఉద్యోగాలు సాధించారు.
– డాక్టర్ మండి అన్వర్ హుసేన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, ఉస్మానియా కళాశాల

చాలా సంతోషంగా ఉంది

ఆల్‌సెక్ టాక్నాలజీస్ సంస్థ చెన్నై కంపెనీకి ఎంపిక య్యాను. నేను సివిల్ సర్వీ సెస్ ఐఏఎస్, ఐపీఎస్ సాధించిన వారి ఇంటర్వ్యూ లు ఫాలో కావడం నా ఇంటర్వ్యూకు సహకరించాయి. మంచి సంస్థలో ఉద్యోగానికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. – నాయకంటి అమూల్య, బీఎస్సీ (ఎంపీసీఎస్), మూడో సంవత్సరం

వర్కింగ్ స్కిల్‌ను గుర్తించి

ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యాను. సొంతంగా వ్యాసాన్ని రాయడం, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారు. ముఖ్యంగా వర్కింగ్ స్కిల్, వర్కింగ్ స్టైల్, స్టామినా ఉందా లేదా అనేది వారు గమనించారు. హైదరాబాద్‌లో ప్లేస్‌మెంట్ ఇచ్చే అవకాశం ఉంది.
– రేణుక, బీకాం కంప్యూటర్స్, తృతీయ సంవత్సరం

ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఉద్యోగం

ఉద్యోగానికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్న చిన్న వ్యాపారి. ఆయన కు తోడుగా నిలవాలనుకున్నారు. కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్‌లో ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఉద్యోగం లభించింది. కళాశాలలో ఇచ్చిన శిక్షణ బాగా తోడ్పడింది. డిగ్రీ పూర్తి కాక ముందే ఉద్యోగానికి ఎంపిక కావడం గర్వంగా ఉంది.– షేక్ షాఫిర్, బీకామ్, తృతీయ సంవత్సరం

డిగ్రీ పూర్తికాకుండానే ఉద్యోగం

మాది మధ్య తరగతి కుటుంబం.డిగ్రీ పూర్తికాకుండానే ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. కళాశాల ఇంటర్న్‌షిప్ ఉద్యోగ సాధనకు ఉపయోగ పడింది. ఈ ఏ డాది నుంచే ఇది పూర్తి స్థాయిలో అమలు చేయడంతో మాలాంటి యువతకు మంచిఉద్యోగాలు లభిస్తాయి.
–షేక్ షేక్షావలి,బీఎస్సీ డిగ్రీ, తృతీయ సంవత్సరం

పావలా వడ్డీ వైఎస్సార్ చలవే

- పొదుపు సంఘాలను నిర్వీర్యం చేసిన బాబు
- టీడీపీ ప్రభుత్వ హయాంలో వంద సంఖ్యలో కరువు మండలాలు
- సీఎం జగన్ పాలనలో ఒక్క కరువు మండలం లేదు
- ఆసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పొదుపు సంఘాలు ఇంతలా ఆర్థిక పరిపుష్టి చెందాయంటే దివగంత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పావలావడ్డీ చలవేనని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాణ్యంలోని శ్రీ వీరనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో మూడవ విడత వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పావలా వడ్డీ ప్రవేశపెట్టడం వల్ల మహిళలు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. అంతేకాక ఎలాంటి గ్యారెంటీ లేకుండా బ్యాంక్‌లు లక్ష రుణాలు ఇస్తున్నాయంటే ఆనాడు వైఎస్సార్ తీసుకున్న నిర్ణయమేనన్నారు. అందుకే నేడు మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని, తండ్రి బాటలోనే తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నారన్నారు. పొదుపు సంఘాలకు మూడవ విడత ఆసరా ద్వారా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి రూ.19వేల కోట్లు జమ చేశారన్నారు. పాణ్యం మండలానికి 749 గ్రూప్‌లకు గాను రూ.4.25 కోట్ల ఆసరా సొమ్ము మంజూరైనట్లు తెలిపారు.

చంద్రబాబు వల్లే మహిళలు డిఫాల్టర్లుగా...

2014 ఎన్నికల సమయంలో పొదుపు మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని, తాకట్టు పెట్టుకున్న బంగారాన్ని విడిపిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చాక వారిని మోసం చేశారని ఎమ్మెల్యే కాటసాని ఆరోపించారు. రుణాలు మాఫీ చేయక, బంగారం రాక 30 లక్షల మంది మహిళలు డిఫాల్టర్లుగా మారారున్నారు. పొదుపు సంఘాలను నిర్వీర్యం చేశారన్నారు. దీంతో నేడు ఆ మహిళలు బ్యాంక్‌ల వైపు చూడలేని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో రైడీయిజాన్ని కూకటివేళ్లతో సహ పెకిలించిన సీఎం జగన్ ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నారన్నారు. అయితే ప్రతిపక్ష నాయకులు మాత్రం ఆయా నియోజకవర్గాలకు పోటీ చేసే అభ్యర్థులపై కనీసం 12 కేసులు ఉండాలనే దుర్మార్గపు, క్రిమినల్ ఆలోచనలతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని మండిపడ్డారు. అనంతరం సీఎం చిత్ర పటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. లబ్ధిదారులకు ఆసరా మెగా చెక్కు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, ఎంపీపీ ఉసేన్‌బీ, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలంచంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బారాయుడు, బాబు, కో ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి, ఏసీఓ బాబురావు, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, ఏపీఎం ప్రసాద్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సరళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

కల్లూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కల్లూరు అర్బన్ నిర్మల్‌నగర్ పార్కులో ఆసరా సంబరాలలో భాగంగా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 32,33,34,35వ వార్డులలోని మొత్తం 517 పొదుపు సంఘాల మహిళలకు రూ. 3.27కోట్ల చెక్కును అందించారు. మహిళలతో కలసి సీఎం చిత్రటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు పొందిన రుణాలతో మెరుగైన జీవనోపాధులను కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, పలువురు కార్పొరేటర్లు, ఆయా వార్డులోని వైఎస్సార్‌సీపీ నాయకులు, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, టీఎమ్‌సీ సుధాకర్, సీఎమ్ఎమ్‌లు, సీఓలు తదితరులు పాల్గొన్నారు.


ఆసరా ఉత్సవాలకు హాజరైన పొదుపు సంఘాల సభ్యులు


నిర్మల్ నగర్‌లో పొదుపు మహిళలకు చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని


నిర్మల్ నగర్‌లో కార్యక్రమానికి హాజరైన మహిళలు

'గడప గడప' సమస్యలను సత్వరం పరిష్కరించాలి

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్


అధికారులతో మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు విన్నవించుకుంటున్న సమస్యలను సత్వరం పరిష్కారం చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులు, జేసీఎస్ కన్వీనర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు కోడుమూరులో, 17 నుంచి 23వ తేదీ వరకు సి.బెళగల్ మండలంలో కార్యక్రమం ఉంటుందన్నారు. ఆ తర్వాత 25, 26వ తేదీల్లో నిడ్జూరులో, 27, 28వ తేదీల్లో జి.శింగవరంలో కొనసాగుతుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను నోట్ చేసుకుని వాటిని తప్పకుండా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓలు భాస్కర్ నాయుడు, మాధవీలత, చంద్రశేఖర్, తహసీల్దార్లు శివరాముడు, శేషఫణి, శంకర్‌నాయక్, రామాంజనేయులు, ఏపీఎంలు మల్లికార్జున, వెంకటస్వామి, సుధాకర్, శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్లు ఎల్ వెంకటేశ్వర్లు, మహేశ్వర్‌రెడ్డి, తులసిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' బ్యాగులు, స్టిక్కర్లు విడుదల


'నువ్వే మా నమ్మకం జగన్' బ్యాగులు, స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కోడుమూరు నియోజకవర్గంలో ఈ నెల 4వ తేదీ నుంచి 23వ తేదీ వరకు 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం చేపడుతున్నామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో 'మా నమ్మకం నువ్వే జగన్' అన్న పేరుతో స్టిక్కర్లు, బ్యాగుల కిట్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడుమూరు నియోజకర్గంలోని నాలుగు మండలాల్లోని గృహసారథులకు స్టిక్కర్లు, బ్యాగుల కిట్స్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు. గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు, వలంటీర్లుందరూ కలిసి 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్లను ఇంటింటికి అతికించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్లు సత్యంరెడ్డి, ఎల్ వెంకటేశ్వర్లు, మహేశ్వర్‌రెడ్డి, తులసిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సత్యారెడ్డి, వైస్ ఎంపీపీ2 నెహమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమేశ్వర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉలిందకొండలో బండలాగుడు పోటీలు

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో ఈ నెల 6న శ్రీశ్రీ ఘనమద్దిలేటి స్వామి తిరునాల సందర్భంగా బండలాగు పోటీలు(న్యూక్యాటగిరి), భజన పోటీలు, గుండు ఎత్తు పోటీలు నిర్వహిస్తున్నట్లు మద్దిలేటిస్వామి ఆలయ క్యార్యనిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం శ్రీ ఘన మద్దిలేటి వారికి, శ్రీ లక్ష్మిదేవి వారికి కల్యాణ మహోత్సవం, సాయంత్రం ప్రభ మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

టవర్ల నిర్మాణాలపై రైతుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు గ్రామ సమీపంలో చేపడుతున్న విద్యుత్ టవర్ల నిర్మాణాలపై మంగళవారం బాధిత రైతులు నిరసన వ్యక్తం చేశారు. రైతుల అనుమతి లేకుండా గ్రీన్‌కో సంస్థ యాజమాన్యం అక్రమంగా పొలాల్లో విద్యుత్ టవర్ల నిర్మాణాలకు గుంతలు తవ్వడాన్ని వారు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కొందరు రైతులు మాట్లాడుతూ.. రూ.లక్షల విలువ చేసే ప్రైవేట్ భూముల్లో విద్యుత్ టవర్లను నిర్మించడం అన్యాయమన్నారు. విద్యుత్ టవర్లు నిర్మించడం వల్ల ఎకరా రూ.50 లక్షల విలువ చేసే భూమి కనీసం రూ.5 లక్షలు కూడా ధర చేయదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్టపోతున్న స్థలాలకు తగిన పరిహారం చెల్లించాలని, లేదంటే సదరు భూములను గ్రీన్‌కో సంస్థ వారు ఎకరాకు రూ.50 లక్షలు చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టా భూములతో పాటు, మాన్యం భూముల్లో కూడా దేవదాయశాఖ అధికారుల అనుమతి తీసుకోకుండా గుంతలు తవ్వడం దారుణమని సదరు కాంట్రాక్టర్‌తో వాదనకు దిగారు. కార్యక్రమంలో రైతులు స్వామిరెడ్డి, మద్దిలేటిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, చిన్న తిరుపాలురెడ్డి, ఆలయ ఈఓ మద్దిలేటి, ఫణికుమార్, జోహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోనవరంలో ధార్మిక కార్యక్రమాలు


మాట్లాడుతున్న వెంకటరెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని గోనవరం గ్రామంలోని శ్రీకృష్ణదేవాలయంలో మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ భారతీయసనాతన వైదిక ధర్మాన్ని వాడవాడలకు తీసుకుపోయేందుకు చర్యలు చేపట్టామన్నారు. గ్రామంలో మూడు రోజుల పాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై వైష్ణవ రామశేషయ్యచే ప్రవచనాలు ఉంటాయన్నారు. ప్రతి రోజు భజనలు ముగింపు సందర్భంగా గోపూజ, కుంకుమార్చన పూజలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మొదటిరోజు రామాయణం మానవీయ విలువలు అనే అంశంపై ప్రవచించారన్నారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మచార్యులు అల్లె శివరామిరెడ్డి, అర్చకులు వెంకటశేషయ్య, ఆలయ ధర్మకర్త సానే పక్కిరారెడ్డి, శేషిరెడ్డి, పుల్లయ్య, రామసుబ్బయ్య, శివరామిరెడ్డి, నాగలక్ష్మమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ విద్యావ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: రాష్ట్రంలో అమలవుతున్న విద్యా వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.1.91 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించిన అదనపు గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించడమే కాక, విద్యబోధనలో శాశ్వత ప్రక్షాళన చేశారన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఇంగ్లిష్‌లో బ్రిటిష్ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న తీరును కళ్లారా చూస్తున్నామన్నారు. అంతేకాక ప్రతి విద్యార్థి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. అందకు సీఎం ప్రతి పేద విద్యార్థికి అమ్మఒడి, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, వసతి దీవెన తదితర పథకాలు అమలు చేసి అండగా ఉంటున్నారన్నారు. కాగా నాడు-నేడు కింద పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. మిషన్ ద్వారా వస్తున్న నీటిని తాగి...అలాగే విద్యార్థులకు నీటిని అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, మహేశ్వరరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, చెర్మన్ కవితా, కోఆప్షన్ సభ్యులు సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, బాబు, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, ఎల్లక్రిష్ణ, హెచ్ఎం జిలానీ, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి, మహేంద్రరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతును ఆదుకుంటాం

మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన బొరుకంటి మహేంద్ర కౌలుకు సాగు చేస్తున్న ఐదెకరాల మొక్కజొన్న పంట ఇటీవల్ల అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. దీంతో మంగళవారం ఎమ్మెల్యే కాటసాని మంగళవారం పొలం వద్దకు వెళ్లి కాలిపోయిన పంటను పరిశీలించి రైతుతో మాట్లాడారు. అగ్ని ప్రమాదం ఎలా సంభవించింది సాగు చేసి విధానం, దిగుబడి వివరాలు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులతో సమీక్షించి రైతును అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. అక్కడే వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, శేషారెడ్డి, శేషయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

కోడుమూరు రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా మండలంలోని లబ్ధిదారులందరికి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మండలంలోని వర్కూరు గ్రామంలో ఎంపీడీఓ పర్యటించి గ్రామ సచివాలయాలను తనిఖీ చేయడంతో పాటు, పింఛన్ల పంపిణీని పరిశీలించారు. మండలంలో 8845పింఛన్లుండగా, మంగళవారం సాయంత్రానికి 5083మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ల సొమ్ము అందజేశారన్నారు. బుధవారంలోగా మండలంలో 100శాతం పంపిణీ పూర్తి చేయాలని సూచించారు.

కల్లూరు: మండలంలోని మొత్తం 8215 మంది లబ్ధిదారులు ఉండగా మంగళవారం రోజు 4218 (51శాతం)మందికి పింఛన్ పంపిణీ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.


వర్కూరులో ఉమావతికి వికలాగుల పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మాదన్న, పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్


పల్లలో వృద్ధుడు నాగేశ్వరరావు వేలిముద్రలు తీసుకుంటున్న వలంటీర్ జయరామిరెడ్డి

నేటి హనుమాన్ జయంతి ఉత్సవాలు

- 6న మహా రథోత్సవం

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని పడమటి బీసీ కాలనీలో కొలువైన శ్రీ పడమటి ఆంజనేయ స్వామి (కోదండ రాముని) ఆలయంలో బుధవారం నుంచి శ్రీ హనుమాన్ ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలలో భాగంగా 5వ తేదీ ఉదయం 8 గంటలకు గణపతి పూజ, శ్రీ ఆంజనేయ, శ్రీ రాముల వారికి పంచామృతాభిషేకం, 11:43 గంటలకు సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు తీర్థప్రసాదం పంపిణీ , 6వ తేదీ ఉదయం 10 గంటలకు రథాంగ హోమము, మధ్యాహ్న ఒంటి గంటకు తీర్థప్రసాదం పంపిణీ, సాయంకాలం 4 గంటలకు శ్రీ ఆంజనేయ, శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి మహారథోత్సవం నిర్వహిస్తారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

సి.బెళగల్: ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన మహిళా పోలీస్‌లు, ఆరోగ్య కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. బాలబాలికలు, మహిళలు, గర్భిణుల ఆరోగ్యంపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని, అంగన్‌వాడీల నిర్వహణ, లబ్ధిదారులకు పోషకాహారం అందజేయాలని సూచించారు.